క్లుప్తంగా

హరీశ్‌రావు పరామర్శ



వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటజోన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, పరందాములు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకు లు రాధాకృష్ణ శర్మ, శ్రీనివాస్, మధు తదితరులు ఉన్నారు.

సీహెచ్‌సీలో మందులు లేవు..

ఇబ్రహీంనగర్ సీహెచ్‌సీలో మందులు లేక ఇబ్బందులు పడుతున్నామని గోనెపల్లి గ్రామస్తులు హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. సిబ్బంది కూడా అందుబాటులో ఉండటంలేదని వాపోయారు. సమస్యను పరిష్కరించేలా చూడాలని వారు కోరారు.

పోలింగ్ డ్రాఫ్ట్ జాబితాపై సమావేశం

కోహెడ(హుస్నాబాద్): స్థానిక సంస్థల ఎన్నికలకు చెందిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిష్టయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 27గ్రామాలలో 244 వార్డులు 37,644 ఓటర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో మహిళలు 19,044, పురుషులు 18,599, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు తెలిపారు. రాజకీయ ప్రతినిధులకు జాబితా పత్రాలను అందించి అభ్యంతరాలు, ఉంటే తెలియజేయాలని కోరారు. ఎంపీఓ శోభ, నాయకులు నరేందర్ రెడ్డి, వెకటస్వామి, మహేశ్, గోపి, వెంకటేశం, నర్సయ్య, నాగరాజు, కుమారస్వామి, లక్ష్మణ్, సత్తిరెడ్డి, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

భక్తితోనే మానసిక ప్రశాంతత



అభిషేకం చేస్తున్న మాధవానంద

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి ఒక్కరు భక్తిని అలవర్చుకుంటేనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని మాధవానంద సరస్వతి చెప్పారు. మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న గీతా పారాయణంలో భాగంగా గురువారం శ్రీకృష్ణుడికి 108కిలోల పంచదారతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భక్తి భావనతో నిండిన పల్లెలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైదిక నిర్వాహకులు విట్టాల రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖరశర్మ, రమేశ్ శర్మ, గీతా పారాయణ నిర్వాహకులు లక్ష్మయ్య, బాలరాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజం హితం కోసం ముందుంటాం

మిరుదొడ్డి(దుబ్బాక): సమాజ హితం కోసం చేసే కార్యక్రమాలకు పార్టీలకు అతీతంగా తామంతా ముందుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశం, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు మల్లేశం అన్నారు. గురువారం ధర్మారంలో వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి 22వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న 'రన్ ఫర్ యాంటీ డ్రగ్స్' కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రన్ జరుగుతుందని, యువత అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వివిధ పార్టీల నాయకులు బాలరాజు, శ్రీనివాస్, లింగం, పరశురాములు, యాదగిరి, కనక రెడ్డి,ఐలయ్య, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

చేతిరాతపై అవగాహన



నోట్‌బుక్స్ అందజేస్తున్న శ్రీనివాస్

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చేతిరాతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు కూరాకుల శ్రీనివాస్ విద్యార్థులకు తన సొంత ఖర్చులతో నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమానికి చేతిరాత నిపుణుడు ఎజాస్ అహ్మద్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతిరాత బాగుంటే పరీక్షల్లో కొన్ని మార్కులు పడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నీలం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వేదిక'కు తాళం.. రైతుల అసహనం

మధ్యాహ్నం 2గంటల వరకు మూత

- పచ్చని మొక్కలు మూగజీవాలపాలు
- వ్యవసాయ కార్యాలయం ఎక్కడ?



మధ్యాహ్నం వరకు తెరుచుకోని వేదిక.. ఆవరణలో మొక్కలను తింటున్న మూగజీవాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులంతా ఒకచోట చేరి వ్యవసాయం గురించి చర్చించుకోవడం కోసం గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటుచేసి ఒక్కో క్లస్టర్‌కు ఒక వేదిక కొలువుతీరింది. మండలంలో మొత్తం ఆరు రైతు వేదికలున్నాయి. ఒక్కో వేదిక నిర్మాణం కోసం సుమారు రూ.22లక్షలు ఖర్చు పెట్టింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ)తో రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ఈ రైతు వేదికలను అప్పటి ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది.

మొక్కలకు రక్షణ కరువు

రైతు వేదిక ఆవరణలో నాటిన పచ్చని మొక్కలు గొర్రెల పాలవుతున్నాయి. ఈ వేదికలో గతంలో పనిచేసిన ఏఈఓ సబియా దాదాపు 50నుంచి 60వరకు మొక్కలను కంటిరెప్పలా కాపాడుకుంటూ వచ్చారని రైతులు చెప్తున్నారు. ఇటీవల ఆమె బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో సంగీత వచ్చారు. కొద్ది రోజులకు సంగీత స్థానంలో డిప్యూటేషన్‌పై హుస్నాబాద్ నుంచి వచ్చిన విజయ్ ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు.

వెనుదిరిగిన రైతులు

అయితే ఈ ప్రస్తుతం ఈ రైతు వేదికలు తాళాలువేసి దర్శనమిస్తున్నాయి. అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక మధ్యాహ్నం రెండు గంటలు దాటినా తలుపులు తెర్చుకోవడం లేదు. దీంతో వివిధ సమస్యలపై సమాచారం తెలుసుకోవాలని వచ్చిన కొంతమంది రైతులు గురువారం వెనుదిరిగి వెళ్లారు. రైతు వేదికల్లో అందుబాటులో ఉండవలసిన ఏఈఓ లేకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు.

వ్యవసాయ కార్యాలయం ఎక్కడ?

అక్కన్నపేట మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. రుణమాఫీ, రైతు భరోసా తదితర సమస్యలపై రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యవసాయ అధికారి (ఏఓ)ని కలవాలంటే ఎక్కడ అందుబాటులో ఉంటారో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ కార్యాలయం 'అక్కన్నపేట'లో లేకపోవడంపై రైతులు ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా అక్కన్నపేట మండలంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టిసారించి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫోన్‌చేస్తే ఎక్కడకు రావాలో చెప్తున్నా..

మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం అనేది లేదు. రుణమాఫీ, రైతు భరోసా తదితర సమస్యలపై రైతులు ఫోన్‌చేస్తే ఎక్కడికి రావాలో చెబుతున్నా. అదేవిధంగా గ్రామాల్లో తిరిగే సమయంలో రైతులను కలుస్తున్నాం. ప్రతి మంగళవారం రైతు వేదికలో అందుబాటులో ఉంటున్నా. ఈ రోజు శాంపిల్ ఎలా చేయాలో నేర్చుకునేందుకు హుస్నాబాద్ ఏఓ వద్దకు వచ్చాను. ఏఈఓ విజయ్ రైతు వేదికలో ఉండాలి. తాళంవేసి ఉన్న విషయం తెలుసుకుంటా.

– తస్లీమా సుల్తానా, వ్యవసాయ అధికారి, అక్కన్నపేట మండలం

కాలిస్తే కాలుష్యం.. దున్నితే భూసారం

ఏఓ నరేశ్



దుబ్బాకటౌన్: రైతులతో మాట్లాడుతున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: వరి పంట పూర్తికాగానే రైతులు కొయ్యలను కాలుస్తున్నారని దాని ద్వారా భూసారవంతం దెబ్బతింటుందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ అన్నారు. గురువారం రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లిలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. వరి కొయ్యలను దున్నితే భూసారం పెరుగుతుందని చెప్పారు. వరి కొయ్యలను భూమిలో రోటవేటర్‌తో కలిపిదున్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎకరానికి ఒక బ్యాగ్ వెయ్యడం ద్వారా వరి కొయ్యలు త్వరగా కుళ్లిపోయి భూమిలో కలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రజిత, రైతులు పాల్గొన్నారు.

పోషకాలు అందవు

తొగుట(దుబ్బాక): వరి కొయ్యలను కాలిస్తే భూమికి పోషకాలు అందకుండా పోతాయని ఏఈఓ నాగార్జున అన్నారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో వేస్ట్ డీకంపోజర్ వినియోగించిన అంజాగౌడ్ పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరికొయ్యలు, గడ్డిని కాలిస్తే సాగుకు ఆక్సిజన్ అందక కుళ్లిపోతుందన్నారు.

వీరన్నపేటలో పోలీసుల 'కనువిప్పు'



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ నవీన్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేటలో బుధవారం రాత్రి చేర్యాల పోలీసులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ నవీన్ మాట్లాడుతూ మంత్రాలు.. తంత్రాల పేరుతో తోటి వారిపై కక్ష పెంచుకోవద్దన్నారు. ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకోవాలని, అంతేకాని ఇతర కులస్తులు, మతస్తులను అనుమానించవద్దని సూచించారు. మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతలపై పోలీస్ కళాబృంద సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృంద సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, ప్రకాశ్, భిక్షపతి, హరిప్రసాద్, శైలజ నాటకం, పాటల రూపంలో ప్రజలకు అవగాహనకల్పించారు.

'ఆయిల్‌పామ్'తో అధిక లాభాలు

ఉద్యాన డివిజన్ అధికారి బాలాజీ



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

కోహెడ(హుస్నాబాద్): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ డివిజన్ అధికారి బాలాజీ సూచించారు. మండల కేంద్రంలోని మండల రాంరెడ్డికి చెందిన ఆయిల్ పామ్ తోటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సబ్సిడీపై అవగాహన కల్పించారు. మూడేళ్లగా అంతర పంట సాగు చేసుకోవచ్చని, సలహాలు సూచనల కోసం ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సతీశ్, విస్తరణ అధికారులు శ్రీధర్‌రెడ్డి, శివ, రాకేశ్, మహిపాల్‌రెడ్డి, ఆయిల్‌పామ్ ఫెడ్ క్షేత్ర అధికారి రాము, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మైత్రీవనం 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని లైన్ల కింద చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చిన్నకోడూరు (సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ శివారులో గురువారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చిన్నకోడూరు పోలీసులు కలసి ఓ పేకాట స్థావరంపై దాడులు చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,744, ఆరు మొబైల్ ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

మద్యంసేవించి వాహనాలు నడిపితే చర్యలు

తొగుట(దుబ్బాక): మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ రవికాంత్‌రావు హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి సిద్దిపేట న్యాయమూర్తి శ్రావణి రూ.6,500 జరిమానాతో పాటు ముగ్గురికి ఒకరోజు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

దుబ్బాకటౌన్: మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఓ ఎద్దు మృతి చెందిన ఘటన రాయపోల్‌లో గురువారం చోటుచేసుకుంది. రైతు బొడ్డు కిష్టయ్య తన ఎడ్లను రోజూ లాగానే మేత కోసం పొలానికి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో గడ్డిమేస్తూ ఓ ఎద్దు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన వైర్‌కు తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.70వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్థానికులు కోరారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగం పునఃప్రతిష్ఠాపన

ఝరాసంగం(జహీరాబాద్): ఆధ్యాత్మిక క్షేత్రం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో జ్యోతిర్లింగ శివలింగం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేశారు. ఆశ్రమ పీఠాధిపతులు 108వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డా.సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. అలాగే, జ్యోతిర్లింగానికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, ధనసిరి ఆశ్రమ పీఠాధిపతి వీరయ్య స్వామి, వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్



దుబ్బాకలో సర్వేను పరిశీలిస్తున్న రమేశ్ కుమార్

దుబ్బాకటౌన్/సిద్దిపేటకమాన్: మున్సిపల్ పరుధుల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయా మున్సిపల్ కమిషనర్‌లు గురువారం పరిశీలించారు. దుబ్బాక 17వ వార్డులో జరుగుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ కల్యాణం రమేశ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని 20 వార్డులలో సర్వే ప్రారంభమైందని, 5,142 దరఖాస్తులకు ఇప్పటి వరకు 510 దరఖాస్తులను యాప్‌లో ఎంట్రీ చేశామని చెప్పారు. ఆయన వెంట వార్డు ఆఫీసర్ నరేశ్, ఆర్పీ చందన తదితరులు ఉన్నారు. అదే విధంగా సిద్దిపేటలో జరుగుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పరిశీలించారు. శరబేశ్వరాలయం వెనుకవైపు ఉన్న ఖాళీ స్థలంలో చెత్త ఉండడాన్ని గమనించి పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింప చేశారు. ఆయన వెంట కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్



దుబ్బాకటౌన్: పోటీలను ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి బాబు నాయక్

దుబ్బాకటౌన్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి చదువుతోపాటు క్రీడలలోను రాణించాలని రాయపోల్ మండలం ప్రత్యేక అధికారి బాబునాయక్ అన్నారు. ఎంపీడీఓ బాలయ్య, ఎంఈఓ సత్యనారాయణరెడ్డితో కలిసి గురువారం ఆయన రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడలు ప్రారంభించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఎంపీఓ శ్రీనివాస్, హెచ్‌ఎం నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయురాలు పావని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పరమేశ్, పూర్ణచందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

హుస్నాబాద్/అక్కన్నపేట(హుస్నాబాద్): వివిధ మండలాల్లో ప్రారంభించిన సీఎం కప్ పోటీలు గురువారంతో ముగిశాయి. హుస్నాబాద్ స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఎస్‌ఐ తోట మహేశ్ తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అదేవిధంగా అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విజేతలకు ఎంపీడీఓ భానోతు జయరామ్, వ్యాయామ ఉపాధ్యాయుడు జంగపల్లి వెంకటనర్సయ్య బహుమతులను అందజేశారు.

మహాసభలో గద్దర్ పుస్తకాల ఆవిష్కరణ

డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్

మిరుదొడ్డి(దుబ్బాక): సిద్దిపేట విపంచి కళానిలయంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ప్రజామహాసభలో ప్రజా యుద్ధనౌక గద్దర్ రచించిన నాలుగు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ అన్నారు. అక్బర్‌పేట భూంపల్లిలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న సిద్దిపేటలో జరగనున్న ఈ మహాసభకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారా యణ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో నడిపితే చర్యలు తప్పవు

ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

సిద్దిపేటకమాన్: వాహనాలను రాంగ్ రూట్‌లో నడిపిన వారిపై కేసులు నమోదుచేసి, చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. పట్టుబడిన వాహనదారులకు స్టేషన్ ఆవరణలో గురువారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. పట్టుబడిన 19వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్‌ల మొత్తం రూ.19,250 కట్టించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 17మంది వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి రూ.21,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆసక్తి పెంచితే మంచి ఫలితాలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్తయ్య

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరిగేలా బోధిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలో బోధన, మధ్యాహ్న భోజన నిర్వహణ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎలాంటి అలసత్వం చూపవద్దన్నారు. నాణ్యమైన సరుకులతో భోజనం అందేలా చూసుకోవాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూములను కాపాడాలని వినతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపెల్లి సీతారామచంద్రస్వామి ఆలయ భూములను కాపాడాలని గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వందేళ్ల నుంచి ఆలయానికి ఉన్న భూమిని రిటైర్డ్ జవానుకు పట్టా ఇవ్వగా గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరిపిన అధికారులు 2018లోను మోఖాలో ఆలయానికి ఉన్నట్టు నివేదిక ఇచ్చారని, ఇప్పుడు దానిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని వారు కోరారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

సీపీ అనురాధ

దుబ్బాకటౌన్: బేగంపేట నూతన ఎస్‌ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మహిపాల్‌రెడ్డి పోలీస్ కమిషనర్ డా.బి.అనురాధను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూశాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ బాధ్యగా విధులు నిర్వహించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ పారిశుద్ధ్య కార్మికులకు నేత్ర వైద్య పరీక్షలు

హుస్నాబాద్: పట్టణంలోని పలువురు పారిశుద్ధ్య కార్మికులకు మమత కంటి ఆస్పత్రి ప్రతినిధులు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. పురపాలక సంఘ చైర్మన్ రజిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కార్మికులంతా ప్రతి రెండు, మూడు నెలలకు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కౌన్సిలర్ హరీశ్, సుప్రజ నవీన్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వైద్యాధికారి మమత, శ్రీకాంత్, అరుణ్, సాయి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ యువ క్రీడాకారులకు ప్రోత్సాహం

నంగునూరు(సిద్దిపేట): సీఎం కప్ పోటీల ద్వారా ప్రభుత్వం యువకులను ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ అన్నారు. నంగునూరులో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. విజేతలకు ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ లక్ష్మణప్ప, ఎంపీఓ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న 'ఇందిరమ్మ' సర్వే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే కొనసాగుతోంది. నర్సాపూర్, అంబేడ్కర్‌నగర్‌తో పాటు ఇతర కాలనీలలో లబ్ధిదారుల సర్వేను గురువారం అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

◆ సైబర్ నేరాలపై అప్రమత్తం

కోహెడరూరల్(హుస్నాబాద్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ అభిలాష్ పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై గురువారం ఆయన పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ, సీవీవీ నంబర్‌లను ఎవరికీ చెప్పవద్దన్నారు. అలాగే యువత మత్తు పదార్థల జోలికి వెళ్లొద్దని సూచించారు.

◆ యువత డ్రగ్స్ జోలికెళ్లొద్దు



వర్గల్(గజ్వేల్): యువత డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మీనాజీపేట సమీప సీతారామ స్పిన్నింగ్ మిల్లు పరిసర టీస్టాల్స్, హోటల్లు, పాన్ డబ్బాలు, చిరువ్యాపారుల దుకాణాల వద్ద నార్కొటిక్ డాగ్‌స్క్వాడ్‌తో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తదితర మత్తుపదార్థాల గురించి తెలిస్తే సమాచారమివ్వాలని కోరారు.

◆ పేదల కోసమే ఇందిరమ్మ ఇళ్లు

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తోందని, అర్హులంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ మైనార్టీ సెల్ మాజీ వైస్ చైర్మన్ వహిద్ ఖాన్ చెప్పారు. స్థానిక 28వ వార్డులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గురువారం ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు.

◆ అనుమతి కోసం ఏసీపీకి వినతి

హుస్నాబాద్: మూడురోజుల పాటు నిర్వహించనున్న చైతన్యయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గురువారం ఆల్ ఇండియా సంస్థ నేషనల్ అధ్యక్షుడు పి.మిత్ర ఏసీపీ సతీష్‌కు వినతి పత్రం అందజేసినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహర ఇండియా సంస్థలో పొదుపు చేసిన డబ్బులు బాధితులంతా 13 నుంచి 15వరకు కోహెడ నుంచి హుస్నాబాద్ మీదుగా ముల్కనూర్ వరకు 'చైతన్య యాత్ర' చేపడతామని తెలిపారు.

◆ వర్గీకరణ అమలుకు కృషి

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమలు చేసేవిధంగా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల మాదిగ, ఉపకులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో రాములు, లక్ష్మణ్, భాస్కర్, రమేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా సంజీవ్

అక్కన్నపేట(హుస్నాబాద్): బీజేపీ నందారం గ్రామశాఖ అధ్యక్షుడుగా రిటైర్డ్ ఆర్మీ జవాన్ కరివేద సంజీవ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం నియమకపత్రాన్ని మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అందజేసి, శాలువాతో సత్కరించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.